కథ

# కోరిక

**విశ్వనాథ్, జగన్నాథ్‌లు ఇద్దరూ ఒకేరోజు సర్వీస్‌లో చేరారు. ఒకేరోజు రిటైరయ్యారు. వారి జీవితాలు సమాంతర రేఖల్లాగా సాగిపోయాయి. విశ్వనాథ్ కొడుకు విదుర్, కూతురు వసుధ. జగన్నాథ్‌కి ఇద్దరూ కొడుకులే శ్రీనాథ్, అమర్‌నాథ్‌లు. రెండోసారి కొడుకు పుట్టినప్పుడు ఎంతో గర్వంతో "నాకు మళ్లీ కొడుకే పుట్టాడు. నీకే పాపం పాప పుట్టింది. అదీ నా కొడుక్కన్నా నెలలు పెద్దది. లేకుంటే నీ కష్టం చూడలేక నేనే వసుధను నా కోడల్ని చేసుకునేవాడిని".**

''చిన్నవాడికంటే నెలలు పెద్దది కానీ మరి మీ పెద్దవాడు వున్నాడు కదా''.

''ఉన్నాడయ్యా ఉన్నాడు. వాడికి మేనరికం ఉందే. వాణ్ణి మా బావమరిది ఎప్పుడో బుక్‌చేసేసుకున్నాడు కదా''

''ఎవరికెక్కడ రాసి పెట్టుంటే అక్కడే అవుతుంది'' నిట్టూర్పు విడిచాడు విశ్వనాథ్.

వసుధ పుట్టినప్పుడు ఎంతో సంతోషించిన విశ్వనాథ్, జగన్నాథ్ మాటలతో ఒకింత ఆలోచనలో పడ్డాడు.

హాయిగా రిటైరైన మొదటిరోజు తనివితీరా పేపర్ చదువుకోకుండా ఎందుకీ పాత జ్ఞాపకాలు అనుకుంటూ ఇంగ్లీషు, తెలుగు పేపర్లు రెండూ తీసుకుని ఉయ్యాల బల్ల మీద కూర్చున్నాడు. తెలుగు పేపర్ రెండు పేజీలు తిప్పగానే జగన్నాథ్, వాడి భార్య చాముండేశ్వరిల ఫోటోలు కన్పించాయి. దాని క్రింద ఇన్ని రోజులు అహర్నిశలు మా కోసం శ్రమించి, ఈరోజు ఉద్యోగ విరమణ చేస్తున్న మా నాన్నగారికి మా హృదయపూర్వక నమస్కృతులతో శ్రీనాథ్, అమర్‌నాథ్ అని ఉంది. విశ్వనాథ్ మళ్లీ ఆలోచనలలోకి జారిపోయాడు. అవును. జగన్నాథ్ ఎప్పుడూ అదృష్టవంతుడే. ఇద్దరు కొడుకులు, భార్య తరపునించి కలిసిన కొంత ఆస్తి, పెన్షన్ కూడా తనకన్నా ఎక్కువే. అన్నిటినిమించి ఇప్పుడు వాడి ఫోటో పేపర్లో వచ్చింది. తనకెంత ముచ్చటో తన ఫోటో కాకపోతే కనీసం తన పేరైనా పేపర్లో చూసుకోవాలని. తను సగటు భారతీయుడు. ఏ ప్రత్యేకతా లేని ఉద్యోగంలో పొట్టకూటి కోసం పనిచేసిన మామూలు ఉద్యోగి. తనకు ఏ కళలలోనూ ప్రవేశం లేదు తద్వారానైనా పేపర్లో ఫోటో చూసుకోవచ్చుననుకుంటే. జగన్నాథ్ కూడా అంతే మరి. కానీ ఈవేళ వాడి ఫోటో పేపర్లో వచ్చింది. అదే అదృష్టమంటే. ఈ ఆలోచనలతో పేపర్ చదవడంలోని ఆనందం కాస్తా ఆవిరైపోయింది. ఇంతలో మనవడు విద్యుత్ వచ్చాడు అక్కడికి.

''తాతా, ఈరోజు నువ్వే నన్ను స్కూల్‌కి తీసుకుపోతావంట కదా. నాన్నమ్మ చెప్పింది నీకింకేం పని లేదని''

'ఓసి దీని దుంపతెగా. ఇంకా రిటైరై ఒక్కరోజున్నా కాలేదు అప్పుడే దీనికింత అలుసైపోయానా'' అనుకుంటుండగానే కోడలు వచ్చింది చేతిలో కాఫీ కప్పుతో. ''ఒరేయ్ తాతగార్ని ఊరికే విసిగించకు. ఇన్నాళ్ళు పనిచేసి చేసి అలసిపోయారు ఆయన్ను రెస్ట్ తీసుకోనీ''

'ఎంతైనా ఉద్యోగ స్తురాలు కదా పనిలోని బరువు బాధ్యతలు తనకు తెలుసు' అనుకుంటూ ఆనందంగా కాఫీ కప్పు అందుకున్నాడు.

'కాఫీ త్రాగి నిదానంగా స్నానం చెయ్యవచ్చు' అనుకుంటూ మళ్లీ పేపర్ అందుకున్నాడు.

''చూశావటోయ్ మా ఫోటో'' అంటూ జగన్నాథ్ వచ్చాడు. ''అమ్మా, వినతా ఇంకో కాఫీ తీసుకురామ్మా'' అంటూ కోడల్ని కేకేశాడు విశ్వనాథ్.

''అసలు నాకు కూడా తెలీదు వాళ్ళిలా ఫోటో పేపర్లో వేయిస్తారని. ఏమైనా మన ఫోటో మనం చూసుకోవడం వేరు. ఊరంతా చూడడం వేరు కదుటోయ్''

జగన్నాథ్ మొహం చిన్నబోవడం చూసింది కాఫీ కప్పుతో వచ్చిన కోడలు వినత.

''మామయ్యా! మీకో సర్‌ప్రైజ్ వసుధ, పిల్లలు ఇంకో గంటలో వచ్చేస్తున్నారు. మీ అబ్బాయి స్టేషన్‌కి వెళ్ళారు తీసుకురావడానికి''

''అదేమిటమ్మా. ఇవి స్కూల్ రోజులు కదా. ఇప్పుడు రావడమేమిటి?'' ఆదుర్దాగా అడిగారు.

''కంగారేం లేదు మామయ్యా. మీ రిటైర్‌మెంట్ రోజుకు మీ దగ్గరుండాలనీ, కేవలం రెండురోజులకు గాను వస్తోంది. మళ్లీ ఎల్లుండే వెళ్ళిపోవాలిట. వాళ్ళన్నయ్య రిటర్న్ రిజర్వేషన్ కూడా చేయించేశారు''

''భలేవాళ్ళే మీరు. నాకు ఒక ముక్కైనా చెప్పలేదు''

''చెబితే ఇంక సర్‌ప్రైజ్ ఏముంది మామయ్యా'' నవ్వుకుంటూ లోపలికెళ్లింది వినత. ఆ సంతోషంలో 'ఇప్పుడు చెప్పేశావుగా ఇంక సర్‌ప్రైజ్ ఏముంది' అన్నమాట కూడా మరిచిపోయారు. వసుధ వచ్చేవరకూ చెప్పకూడదనే అనుకున్నారు కానీ, జగన్నాథం మాటలతో చిన్నబోయిన మామగారి మొహం చూసి, ఆయనను ఆ మూడ్‌నించి తప్పించినట్టు వుంటుంది. ఆ జగన్నాథం గారికి బుద్ధికి చెప్పినట్టు ఉంటుందని చెప్పేసింది. తననుకున్నట్లే ''వస్తానురా విశ్వం'' అంటూ మూతి ముడుచుకుని వెళ్ళిపోయాడు జగం. వసుధ, పిల్లల రాకతో ఇల్లంతా పండగ వాతావరణం ఏర్పడింది. జగన్నాథం ఫోటో విషయం ముల్లులా గుచ్చుకున్నా, మనవల సందడితో అన్నీ మర్చిపోయి ఎంతో ఆనందంగా గడిపారు ఆ రిటైర్మెంట్ మొదటి రోజు.

ప్రావిడెంట్ ఫండ్ డబ్బులు వచ్చాయి చేతికి.

''ఒరేయ్. విదుర్ ఈ డబ్బులేం చెయ్యాలో చూడు''

''చేసేందుకేముంది మామయ్యా. అత్తయ్య మీరు కలిసి ఫిక్స్‌డ్‌లో వేసేయండి''

'ఖర్మ. సిరిరామోకాలడ్డుతోంది ఈ వినత' తనలో తనే విసుక్కున్నాడు విదుర్.

''మా పేరిట ఎందుకమ్మా. ఇంకా ఎన్నాళ్లుంటాం మేం. ఈరోజైనా రేపైనా అది మీకు చెందవలసిందే కదా. ఏదో కొంత వసుధ పేరిట వేసి మిగిలింది మీ పేర వేసేసుకోండి''

''ఈరోజైనా రేపైనా అది మాకు చెందవలసిందేనన్నారు గదా. రేపే చెందనివ్వండి. మాకిప్పుడేం అంత అవసరాలు లేవు. ఉన్నా ఆయన నేను ఇద్దరం ఉద్యోగాల్లో ఉన్నాం కదా. ఏ లోనో తీసుకోవచ్చు. అదీ తక్కువ వడ్డీకి ఇస్తారు మాకు. మీరేం ఆలోచించకుండా ఫిక్స్‌డ్ చేసేయండీ మామయ్యా''

''నాన్న అంతగా చెబుతుంటే నువ్వేంటి, ఆయన మనసు కష్టపెట్టుకోరూ. ఆ డబ్బంతా మీ బ్యాంకులో వేసుకోవాలనేనా''

''అంతేగా మరి. మా బ్యాంకులో దాచుకున్న వాళ్ల డబ్బంతా నాదేకదా. అయినా మీరూరుకోండి. ఇన్నాళ్ళు మామయ్యగారు ఒక్కరు సంపాదించి మిమ్మల్ని చదివించి ఇంత పెద్ద ఆఫీసర్‌ను చెయ్యలేదా. వసుధకు మంచి సంబంధం చూసి పెళ్ళి చెయ్యలేదా. మరి మన ఇద్దరం సంపా

దిస్తున్నాం కదా. మన పిల్లల అవసరాలు మనం చూసుకోలేమా. అంతగా అవసరం అయితే మామయ్యగారు అప్పుడే సర్దు తారు. ఇప్పుడు మాత్రం ఆ డబ్బు మామయ్య, అత్తయ్యల పేర ఉండవల సిందే. ఈయన మాటలకేంగానీ మామయ్యా ఆర్నెల్లకొకసారి వడ్డీ వచ్చేట్టు వేసుకోండి''

''పెద్ద బ్యాంక్ ఆఫీసర్‌వి. నీవు చెప్తేగానీ ఎవ్వరికీ ఏం తెలియదా?''

''నేనేమీ మీ ఇంజనీరింగ్ విషయాలు చెప్ప లేదు కదా. నాకు తెలిసిన విషయాలు చెప్పా నంతే''

''ఆర్నెల్లకొకసారి అంటే కష్టం కదమ్మా. నెలఖర్చులూ అవీ...''

''ఇన్నాళ్ళూ మీరే చూసుకున్నారు. ఇక మీరు రెస్ట్ తీసుకోండి. అవన్నీ మేం చూసు కుంటాం కదా. అట్లా చేస్తే కొంత మొత్తం చేతికొస్తుంది. మీరెన్నాళ్ళనుంచో అనుకుం టున్న కాశీయాత్ర చెయ్యొచ్చు. వసుధ ముచ్చట పడుతున్న ఆ వజ్రపుటుంగరం కొనియ్యొచ్చు''


''వజ్రపుటుంగరం మాటేమో గానీ మాకు మాత్రం వజ్రం లాంటి కోడలు దొరి కింది'' అన్నారు ఉప్పొంగిపోతూ.

అనుకున్న ప్రకారం అత్తమామల పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించింది వినత. మొద టిసారి వచ్చిన వడ్డీతో వసుధకు ఉంగరంతో పాటు వినతకు ఒక నెక్లెస్ కూడా కొన్నారు విశ్వనాథం దంపతులు.

''అదేమిటి మామయ్యా. మీరిద్దరు యాత్రలకు వెళ్లకుండా నాకీ నెక్లెస్ ఎందుకు ఇప్పుడు''

''అమ్మాయ్. ఇంతవరకూ నువ్వు చెప్పి నట్లే చేశాను. ఇందులో మాత్రం మా ముచ్చట కాదనకు. వసుధైనా నువ్వైనా మాకొకటే. నువ్వా నెక్లెస్ పెట్టుకుంటే చూడాలని మీ అత్తయ్య తెగ ముచ్చటపడు తోంది''

వజ్రపుటుంగరంతో పోటీపడుతున్నట్టుగా మెరుస్తున్న వసుధ మొహం, కొత్త నెక్లెస్‌తో కళక ళలాడుతున్న వినత మొహం చూసి తెగ సంతోష పడిపోయారు విశ్వనాథం దంపతులు.



అంతలోనే వచ్చాడు జగన్నాథం. 'మామగారి ఆనందం హరించడానికి వచ్చాడు మళ్ళా'' అను కుంటూ పక్కకు తప్పుకుంది వినత.

''ఏంటి జగన్నాథం విశేషాలు''

''ఏం చెప్పమంటావురా. ప్రావిడెంట్ ఫండ్ వచ్చినట్టే వచ్చి మాయమైపోయింది''

''అదేంటి, నాకన్నా నీకు కొంచెం ఎక్కువ వచ్చింది కదా. ఇంతలోనే అంతా ఎట్లా అయిపో యింది. నాకేం అర్థంకావడం లేదు''

''నీకెట్లా అర్థమవుతుంది. ఎంచక్కా బ్యాంకర్ కోడలు. అన్నీ వాళ్ళే చూసుకుంటారు''

''ఆ మాట నిజమే. మా కోడలు బంగారం. అన్నీ తనే చూసుకుంటుంది. అయినా ఈ దెప్పి పొడుపులెందుకుగానీ అసలేమైంది?''

''ఏముందీ అయ్యేందుకు. ఫండ్ రాగానే నాన్నా. నీకు సొంత ఇల్లంటే ఎంతో ముచ్చట

**వి.రుక్మిణి**

కదా. ఓ ఫ్లాట్ బుక్ చేశాను. ఫైనల్ పేమెంట్ కట్టేస్తే ఇక ఇల్లు మనదే అన్నాడు పెద్దాడు.

''ఏంటీ ఇల్లంటున్నావ్. ఎవరి పేరిట కొంటు న్నారేమిటి. నాన్నదైతే సరే. నీ పేరంటే మాత్రం కుదరదు. అలాగైతే నా సగం నాకు పారెయ్. నీ పేరిట ఇల్లు కొంటే నాకేం ఒరుగుతుంది'' రెట్టిం చాడు మా చిన్నాడు. ఎట్టయితేనేం ఇద్దరు ఓక అండర్‌స్టాండింగ్‌కు వచ్చి ఫండ్ డబ్బు చెరిసగం పంచేసుకున్నారు. మరి నా సంగతేమిట్రా అంటే మేముండగా నీకు దిగులెందుకు నాన్నా అన్నారు. నేను కూడా అవును రిటైర్మెంట్ రోజు పేపర్‌లో

కూడా వేయించారు కదా తమ కోసం నేనెంతో కష్టపడ్డానని, తామెంతో కృతజ్ఞతతో ఉంటామని అని ఆలోచించి తెగ మురిసిపోయాను. పిచ్చి ముండావాడిని. ఇప్పుడు చూడు పెద్దవాడింట్లో గదులు చాలటం లేదట. మమ్మల్ని హాలులో పడుకోమన్నారు. హాలులోనా అంటే ఎంతో వికారంగా చూస్తారు మా వైపు ఈ వయసులో గది కావలసి వచ్చిందా అన్నట్లు. గదంటూ ఉంటే వేళకాని వేళ కాస్త అలసిపోయినట్లయి పడుకోవాలనుకుంటే హాలులోనైతే పడుకోలేం కదా. ముఖ్యంగా మా ఆవిడ. పోనీలే నాలుగురోజులు చిన్నవాడి దగ్గర ఉండొస్తే వీళ్లకు, మాకు కాస్త ఛేంజ్‌గా ఉంటుందనుకుంటే వాడేమో ఇదుగో ఈరోజో, రేపో ట్రాన్స్‌ఫర్ వస్తుంది. కొత్త ఊరు చేరి కాస్త సెటిలవ్వగానే వద్దురుగానీ అని దాటేస్తున్నాడు. ఎప్పుడు తమనే అంటిపెట్టుకుని ఉన్నామని వీడికి కోపం. ఏమిటో విశ్వనాథం, ఇద్దరు కొడుకులేనని. నేనంటే ఎంత ప్రేమ లేకపోతే అలా పేపర్లో మా ఫోటో వేయిస్తారని ఎంతో గర్వపడ్డాం. బాగా శాస్తి జరిగింది. నువ్వే నయం నీ పిల్లలు నిన్నెంతో బాగా చూసుకుంటున్నారు. ఆడపిల్లయినా మీ వసుధ వాళ్ళింటికి కూడా వెళ్ళి వుంటావు నీవు. పైగా నీ డబ్బు నీ చేతిలోనే ఉందాయె. నీకెట్లా కావలిస్తే అట్లా చేసుకోవచ్చు. ఏమైనా అదృష్టవంతుడివి''

'హమ్మయ్య. ఇన్నాళ్ళకు ఈయన మామయ్య గారిని మాటలతో బాధపెట్టకుండా వెళ్తున్నాడు' అని లోలోపలే సంతోషించింది వినత.

''వస్తానురా'' అంటూ జగన్నాథం లేస్తుండగానే ''సార్ కొరియర్'' అన్నాడు అబ్బాయి.

''ఏంటోయ్ కొరియర్లో ఏమొచ్చింది నీకూ'' అంటూ సాగదీశాడు జగన్నాథం.

'పోనిచ్చుకున్నాడు కాదు ఈయన పాడుబుద్ధి' అనుకుని సంతకం చేసి కవరందుకుని ''మీకే మామయ్యా చూడండి'' అంది వినత.

''ఏదైతే ఏంటి నువ్వే చూడమ్మా వినతా'' అన్నాడు విశ్వం.

కవర్ తీసి చూసిన వినత ''అత్తయ్యా, వసుధా ఇలా రండి'' అని గట్టిగా కేకేసింది. ఏమైందోనన్న భయంతో పరుగెత్తుకువచ్చారు ఇద్దరూ.

''ఇది చూడండి. మామయ్య గారికి సాంట్రో కారు ప్రైజ్ వచ్చింది మొన్న జువెలరీ కొనలేదూ ఆ లక్కీ కూపన్‌కు''

''ఈ ప్రైజ్ మీదేనమ్మా వినతా, వసుధా. మీకే కదా జువెలరీ కొన్నది''

''ఇది మరీ బాగుంది. జువెలరీ వాళ్లకీ, కారూ వాళ్లకేనా. అదేం కుదరదు కారు నాకు'' అన్నాడు అప్పుడే ఆఫీస్ నించి వచ్చిన విదుర్.

అక్కడ అందరి మొహాలు కళకళలాడిపోయాయి.

''నేనింక వస్తానురా విశ్వం'' కుళ్ళుకుంటూ వెళ్లిపోయాడు జగన్నాథం.


''నాన్నకు ఎలాగూ డ్రైవింగ్ రాదు. ఆయన తరపున నేనే కారు తీసుకుంటా'' అని ఉబలాటపడ్డాడు విదుర్.

''అదేం కుదరదు. మామగారు తీసుకోవలసిందే. కావాలంటే ఆ తరువాత మీరు కారు నడపవచ్చు ఆయన డ్రైవర్‌గా'' ఉడికించింది వినత.

కంపెనీ జి.ఎం చేతులమీదుగా కారు తీసుకున్నాడు విశ్వనాథం. మరుసటిరోజు అన్ని పేపర్లలోనూ లక్కీ విన్నర్, సాంట్రో విజేత, విజేత విశ్వనాథ్ అన్న హెడ్డింగ్‌లతో అన్ని పేపర్లలోనూ విశ్వనాథం ఫోటోలు వచ్చాయి. ఇంట్లో ఎవ్వరూ చూడకుండా అన్ని పేపర్లు కొనుక్కుని తెచ్చుకున్నాడు. ఒక్కొక్క పేపర్లోని ఫోటో, తన పేరు చూసి చూసి చిన్నపిల్లవాడిలా మురిసిపోయాడు. కారు వచ్చినదానికంటే పేపర్లో వచ్చిన దానికే ఎక్కువ ఆనందించాడు.

''ఇన్నాళ్ళూ లోపల దాచుకున్న నా కోరిక తీర్చింది మీరేనమ్మా వినతా. వసుధా. మీకోసం ఆ నగలు కొనకపోతే ఈకారు వచ్చేది కాదు. అంతకన్నా ముఖ్యం నా పేరు, ఫోటో పేపర్‌లో వచ్చేవికావు''.

ఎంత దాచుకున్నా దాగని ఆనందం విశ్వనాథం మొహంలో తాండవించింది. అది చూసి వారి కుటుంబమంతా ఆనందించింది. వారి ఆనందాన్ని లోకమంతటితో పంచుకోవాలన్నట్లు బొయ్యిమని కారు హారన్ మోగించాడు విదుర్. ✤



## షాపింగ్ అంటే ఇష్టం

**షూటింగ్‌లకోసం విదేశాలకి వెళ్ళే తారలు షాపింగ్‌లు బాగా చేస్తారని అందరికీ తెలిసిందే. దక్షిణాఫ్రికాలోని జోహెన్నెస్‌బర్గ్‌లో ఈమధ్య జరిగిన ఐఐఎఫ్ఎ అవార్డుల ఫంక్షన్‌కి వెళ్లిన ఇషా డియోల్ షాపింగ్‌కి ఎక్కువ టైం కేటాయించిందిట. ఈ ట్రిప్‌లో ఆమె ఇరవై జతల షూస్ కొనుక్కుందిట. సోనీ ఫేస్ ఆఫ్ ది ఇయర్‌గా ఎంపికైనప్పటినుంచి ఇషా తెగ మురిసిపోతోంది. ఇప్పుడామె మంచి గ్లామర్ గార్ల్‌గా తయారవ్వడానికి ఎంతో శ్రమపడుతున్నట్టుంది.**